క్లుప్తంగా

దాడి కేసులో అరెస్ట్, రిమాండ్



పర్వతగిరి: మండలంలోని ముంజాలకుంట శివారు జోగ్యాతండాకు చెందిన భానోత్ ఛత్రు కూతురు మిట్టుపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నల్లబెల్లి మండలంలోని మూడుచెక్కలపల్లి గ్రామానికి చెందిన కణుకుల యాకూబ్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు మామునూరు ఏసీపీ పి.సతీశ్ బాబు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మిట్టుపై యాకూబ్‌రెడ్డి 2023 డిసెంబర్ 31న దాడి చేసినట్లు తెలిపారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యాకూబ్‌రెడ్డి మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై వీరభద్ర రావు, కానిస్టేబుల్ రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



నర్సంపేట రూరల్ : మండలంలోని కమ్మపల్లి జెడ్పీ సెకండరీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పని చేసిన శ్రీనివాస్‌ను, గణిత ఉపాధ్యాయుడుగా పని చేసిన మనోహర్‌ను బదిలీ అయిన సందర్భంగా స్థానిక జెడ్పీటీసీ కోమాండ్ల జయమ్మ ఆధ్వర్యంలో గురువారం శాలువా కప్పి పూల బోకే అందించి సన్మానించారు. అనంతరం జయమ్మ మాట్లాడారు. ఉపాధ్యాయులకు బదిలీలు తప్పనిసరి అని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వలుగుబెల్లి రంగారెడ్డి, ఎంపీటీసీ వలుగుబెల్లి విజయ, ఉపసర్పంచ్ మిట్టగడపల తిరుపతి, ఎస్‌ఎంసీ చైర్మన్ గడ్డం చెన్నయ్య, హెచ్‌ఎంలు భిక్షపతి, సర్దార్, శోభన్, టీచర్లు సారంగపాణి, గణేశ్, వెంకన్న, మురళీధర్, జ్యోతి, వాణి, జగన్మోహన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నర్సంపేట: పట్టణానికి చెందిన తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారవేత్త దేవునూరి అంజయ్యను అతడి తల్లి సోమలక్ష్మి ఇటీవల మృతి చెందిన క్రమంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. తొలుత సోమలక్ష్మి చిత్రపటానికి సుదర్శన్‌రెడ్డి నివాళులర్పించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, నామాల సత్యనారాయణ, బాల్నె వెంకన్న, కౌన్సిలర్లు దార్ల రమాదేవి, పాషా, నాయకులు గుంటి కిషన్, నాగిశెట్టి ప్రసాద్, గంప రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



గంగారం : రెడ్‌క్రాస్ సహకారంతో మండల ప్రజలకు తహసీల్దార్ రాము, ఎంపీడీఓ అపర్ణ గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఏజెన్సీలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోన్న క్రమంలో దోమల బెడద పెరిగి సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే దుప్పట్లు, దోమ తెరలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. చలి తీవ్రత నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ, మెడికల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలను వినియోగించుకోవాలి

కొత్తగూడ: డీసీసీ బ్యాంకు సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి రజిత కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన వినియోగదారుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మిగతా బ్యాంకులతో పోలిస్తే రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడంతోపాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నట్లు వివరించారు. మండలంలో వినియోగదారుల సంఖ్య పెరిగితే బ్రాంచ్ వచ్చే అవకాశం ఉన్నదని తెలిపారు. కార్యక్రమంలో గూడూరు డీసీసీ బ్యాంకు మేనేజర్, కల్యాణి, సూపర్‌వైజర్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి భవనం హుళక్కేనా?

సంగెం: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి భవనం కేటాయింపు హుళక్కేనా? అన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. గ్రంథాలయ స్థలాన్ని గ్రామ పంచాయతీ భవనానికి కేటాయించిన సమయంలో పాత పంచాయతీ భవనాన్ని గ్రంథాలయానికి కేటాయిస్తామన్న నాటి హామీని పాలకులు, అధికారులు విస్మరించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో చర్చనీయాంశంగా మారిన గ్రంథాలయ భవన సమస్యపై కథనం..

మండల కేంద్రంలో నిజాం కాలం నాటి పాత భవనంలోని శాఖ గ్రంథాలయం ఉండగా గత ప్రభుత్వం ఆ భవనాన్ని గ్రామ పంచాయతీకి కేటాయించింది. అదే సమయంలో నాటి పంచాయతీ భవన స్థలానికి గ్రంథాలయానికి కేటాయిస్తామని ప్రభుత్వం, అధికారులు హామీ ఇచ్చారు. కాగా గ్రంథాలయ స్థలంలో జీపీ భవనాన్ని నిర్మించారు. గ్రంథాలయ స్థలంలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటి నుంచి గ్రంథాలయం అద్దె భవనంలోని ఇరుకు గదిలో కొనసాగుతోంది. కాగా నూతన గ్రామ పంచాయతీ భవన ప్రారంభ సమయంలో పాత జీపీ భవనాన్ని మహిళలకు కేటాయిస్తున్నట్లు ప్రకటిస్తూ నాటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దస్తావేజును సైతం అందజేశారు. ఈ విషయం నిరుద్యోగ యువతను, విద్యార్థులను అసహనానికి గురి చేసింది. మండల కేంద్రంలో మహిళలకు నిర్మించిన భవనం సైతం ప్రారంభమైంది. గతంలో మహిళల కోసం నిర్మించిన భవనాన్ని పాలశీతలీకరణ కేంద్రానికి లీజుకు ఇచ్చారు. మండల కేంద్రంలో శాంతి మండల సమాఖ్య భవనం ఉండగా పాత జీపీ భవనాన్ని మహిళలకు కేటాయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. యువతకు, విద్యార్థులకు జ్ఞానాన్ని అందించే గ్రంథాలయానికి భవనం కేటాయించడంలో మోసపూరితంగా వ్యవహరించారన్న అపవాదు ఉంది. ప్రభుత్వం, జిల్లా అధికారులు శాఖ గ్రంథాలయానికి స్థలాన్ని కేటాయించి భవనాన్ని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం


పాత జీపీ భవనం

పాత జీపీ భవనాన్ని కేటాయించాలి



నిజాం కాలం నాటి గ్రంథాలయాన్ని గ్రామ పంచాయతీకి కేటాయించిన సమయంలో ఇచ్చిన హామీ మేరకు పాత పంచాయతీ భవనాన్ని గ్రంథాలయానికి కేటాయించాలి. గ్రంథాలయాన్ని అద్దె భవనంలో ఏర్పాటు చేసినప్పటి నుంచి వివక్ష కొనసాగుతోంది. నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు విజ్ఞానాన్ని, సమాచారాన్ని అందించే గ్రంథాలయ భవనం పట్ల నిర్లక్ష్యం సరికాదు. పాత జీపీ స్థలాన్ని గ్రంథాలయానికి కేటాయిస్తామని ప్రకటించినా అందుకు భిన్నంగా మహిళలకు కేటాయించారు.

-అగపాటి రాజు, యువజన నాయకుడు

పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చాం



పాత జీపీ భవనాన్ని లైబ్రరీకి ఇస్తామని గతంలో హామీ ఇచ్చారు. లైబ్రరీకి సదరు పాత పంచాయతీ భవనాన్ని కేటాయించాలని సర్పంచ్‌కు, ఎంపీటీసీకి, ఉపసర్పంచ్‌కు, ఎంపీపీకి పలుమార్లు వినతిపత్రాలు అందజేశాం. మండల సర్వసభ్య సమావేశంలో సభ దృష్టికి తీసుకెళ్లాం. వృద్ధులు, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అనువుగా ఉన్న స్థలంలోని భవనాన్ని మహిళా సంఘాలకు కేటాయించామని ప్రకటించడం తగదు. హామీ మేరకు పాత జీపీ భవనాన్ని గ్రంథాలయానికి కేటాయించాలి.

-రామచంద్రం, ఇన్‌చార్జ్ లైబ్రేరియన్

‘కేంద్ర’ పథకాలతో పేదలకు లబ్ధి


సంగెం : మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి


దుగ్గొండి: మాట్లాడుతున్న మేనేజర్ వెంకటేశ్వర్లు

సంగెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ కళావతి తెలిపారు. మండలంలోని లోహిత, రామచంద్రాపురం గ్రామాల్లో నోడల్ అధికారి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ యాకర అనిల్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంపై అవగాహనా సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎంపీపీ కళావతి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. పీఎం ఉజ్వల యోజన, పీఎం ముద్ర యోజన, సుకన్య సమృద్ధి యోజన, పీఎం జీవన జ్యోతి యోజన, సురక్ష బీమా యోజన, తదితర పథకాలను గ్రామస్థాయిలో పేదలకు చేర్చేలా అవగాహన కల్పించే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టినట్లు తెలిపారు. రైతులకు ఏటా రూ.6 వేలు, ఆహార భద్రత పథకం కింద రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లోని సభ్యులకు నెలకు 5 కేజీల చొప్పున బియ్యం ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అవగాహన కలిగి ఉండడం ద్వారానే పేదలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోగలరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగినేని జ్యోతి, బొంపల్లి జయశ్రీ, ఎంపీటీసీలు దుర్గారావు, రజిత రాజు, ఏఈఓ సాగర్, నాయకులు దిలీప్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ ఆధ్వర్యంలో..

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రజలు బ్యాంకులో ఖాతా తీసుకుని సురక్షా బీమా యోజన, ఇతర పథకాలతో కుటుంబానికి రక్షణ కల్పించుకోవాలని సూచించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను వీడియో ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ దయాకర్, సర్పంచ్ పెండ్యాల మమత రాజు, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, బ్యాంక్ మిత్రలు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ


వర్ధన్నపేట : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, ఉపాధ్యాయులు


రాయపర్తి : క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, యూనియన్ నాయకులు

వర్ధన్నపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ స్కూల్ ఆవరణలో పీఆర్‌టీయూటీఎస్–2024 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు తాటిపాముల రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ పక్షపాతిగా పని చేస్తుందన్నారు. త్వరలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాసాక సదానందం, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అనిల్, మండల ప్రధాన కార్యదర్శి అశోక్, మనువేందర్‌రెడ్డి, కుమారస్వామి, ధనలక్ష్మి, సునీత, వాణి, కళ్యాణి, దేవయ్య, వంశీమోహన్, రాజేశ్వర్‌రావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి: మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పీఆర్‌టీయూ–2024 క్యాలెండర్లను ఉపాధ్యాయులతో కలిసి ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసమే కాకుండా పేద విద్యార్థుల ఉన్నతికి యూనియన్ పాటుపడడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రంగు కుమార్, డీసీఈబీ కార్యదర్శి కృష్ణమూర్తి, సంఘం నాయకులు అంజయ్య, రవీందర్, రఘు, స్వామి, ప్రవీణ్‌రెడ్డి, ప్రభాకర్, దేవేందర్, శర్మ, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘ప్రజాపాలన’ సభలు


నర్సంపేట రూరల్:దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీఓ


సంగెం:మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్


నెక్కొండ : మాట్లాడుతున్న ఉషాదయాళ్


చెన్నారావుపేట: మాట్లాడుతున్న సుమన్


గీసుకొండ:దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

నర్సంపేట రూరల్ : ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ మండలంలో గురువారం కొనసాగింది. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీఓ సునీల్‌కుమార్ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలను అర్హులు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యుల పాల్గొన్నారు.

సంగెం: మండలంలోని సంగెం, గవిచర్ల, ముమ్మడివరం, నార్లవాయి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ప్రజల నుంచి తహసీల్దార్ రాజ్‌కుమార్ దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. పేద కుటుంబాలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రేషన్ కార్డులో పేర్లు లేకున్నా ఒకే దరఖాస్తులు పేర్లను చేర్చి దరఖాస్తు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ కొమురయ్య, ఏఓ యాకయ్య, సర్పంచ్‌లు బాబు, రమ, స్వప్న, రజిత, ఎంపీటీసీలు మల్లయ్య, సంపత్‌రెడ్డి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ: మండలంలోని అలంకానిపేట, చంద్రుగొండ, నాగారం గ్రామాల్లో ప్రజాపాలన సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు అనంతలక్ష్మి, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ జానకీదేవి, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, విద్యుత్ శాఖ ఏడీఏ ఐలయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్, పీఆర్ ఏఈ రాజ్‌కుమార్, ఎంపీటీసీ కర్పూరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గీసుకొండ: మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో ఎంపీడీఓ వీరేశం, స్పెషల్ ఆఫీసర్ దేవేందర్ మాట్లాడారు. పేదలందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, సర్పంచ్ దౌడు బాబు, ఎంపీటీసీ దౌడు కోమల, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, ఏఓ హరిప్రసాద్ బాబు, ఏపీఎం సురేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నూనె వేణుప్రసాద్ పాల్గొన్నారు.

కళాకారుల ఆటాపాట

చెన్నారావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం పథకాల అమలు కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభలో తెలంగాణ సాంస్కృతిక కళాబృందం సభ్యులు ఆటాపాటలతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీం లీడర్ నెల్లుట్ల సుమన్, సభ్యులు తాళ్ల సునీల్, పడిదం రాజేందర్, గాదెపాక బాబు, బరిగెల రవీందర్, యోజన, తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో గెలుపే ధ్యేయం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

పర్వతగిరి: రానున్న స్థానిక సంస్థల, పార్లమెంటరీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవడమే ధ్యేయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శ్రేణులు, ప్రజాప్రతినిధులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను నియోజకవర్గ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పార్టీ బలోపేతానికి పని చేస్తూ అన్ని ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలనుఅమలు చేయాలని కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు. తాను ప్రాణం ఉన్నంత వరకు వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల్లోనే ఉంటానని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కుమార్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, ఎంపీపీ కమల పంతులు, పీఏసీఎస్ చైర్మన్‌లు మనోజ్‌గౌడ్, దేవేందర్, వైస్ ఎంపీపీ రాజేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణకు బాటలు


కరాటే తరగతులను ప్రారంభిస్తున్న ఎంఈఓ


కరాటే నేర్పిస్తున్న మాస్టర్ కుమారస్వామి

రాయపర్తి: కరాటే దేహదారుఢ్యంతోపాటు ఆత్మరక్షణకు బాటలు పడతాయని ఎంఈఓ నోముల రంగయ్య తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినిలకు తలపెట్టిన కరాటే శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినులు చదువులకే పరిమితం కాకుండా కరాటే, ఇతర రంగాల్లోనూ రాణించాలని సూచించారు. తద్వారా వ్యక్తిత్వ వికాసానికి మెరుగైన అవకాశాలు ఉంటాయని చెప్పారు. విద్యార్థినుల కోసం ప్రభుత్వం మండలంలోని కొత్తూరు, పెర్కవేడు, తిర్మలాయపల్లి కేజీబీవీ, కొండూరు, కొలన్‌పల్లి, ఊకల్, సన్నూరు గ్రామాల్లో కరాటే శిక్షణా తరగతులు ఏర్పాటు చేసిందని తెలిపారు. విద్యార్థులు కరాటే శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమాల్లో రాయపర్తి, వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల ఇన్‌చార్జ్ కరాటే మాస్టర్ చిన్నాల కుమారస్వామి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఎమ్మెస్పీతోనే సామాజిక న్యాయం’


జెండా ఆవిష్కరిస్తున్న కల్లెపల్లి ప్రణయ్‌దీప్

నర్సంపేట: మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎమ్మెస్పీ)తోనే ప్రజలకు సామాజిక న్యాయం లభిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జ్ తడుగుల విజయ అధ్యక్షతన పార్టీ ఆవిర్భావ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణయ్‌దీప్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ బడుగులకు, వికలాంగులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించే లక్ష్యంతో ముందుకు సాగుతోందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గుంపుల మాలతి లత, బాబు రాజు యాదవ్, చింతం సిద్ధూ, దామెర సుధాకర్, సాయి కుమార్, కత్తి రాములు, రాజు, సరోజన, మాలోతు సరోజన, స్వప్న, నవీన్, సృజన్, వినయ్, వివేక్, సుహాసిని, కవిత, స్వరూప, లావణ్య, విజయ, సంకీర్తన తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు గురుకులాల్లో విద్యపై హర్షం



నర్సంపేట రూరల్ : అనాథ విద్యార్థులకు గురుకులాల్లో, కళాశాలల్లో విద్య అందించే అవకాశం కల్పించడం పట్ల ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి గురువారం ఆయన మాట్లాడారు. అనాథ విద్యార్థులకు అన్ని గురుకులాల్లో చదువుకునే అవకాశం కల్పించాలని కోరుతూ గతంలో తాము ఆర్‌సీఎం, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో అనాథ విద్యార్థులకు విద్య అందిస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో గోపీ, కృష్ణమోహన్, ప్రవళిక, భరత్, కావ్య, రచన, వంశీ, తేజశ్రీ, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

‘ఆల్ ఇన్ వన్’తో మెరుగైన ఫలితాలు


పుస్తకాలు అందజేస్తున్న సుమన్, తదితరులు

రాయపర్తి: ఆల్ ఇన్ వన్ పుస్తకాలు చదవడం ద్వారా పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని మండల నోడల్ ఆఫీసర్ సుమన్ తేజ తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో మండలంలోని పెరికేడు గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లోని టెన్త్ విద్యార్థులకు గురువారం ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ సుమన్ తేజ మాట్లాడారు. విద్యార్థి దశలో పదో తరగతి కీలకమని చెప్పారు. విద్యార్థులు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను వినియోగించుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు అందించినందుకు రోటరీ క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తారా రాజబాబు, ఎస్ఎంసీ చైర్మన్ పరీదుల సుధాకర్, ఎంపీటీసీ బండి అనూష, ఉపాధ్యాయులు ప్రమోద్, వెంకటేశ్వర్లు, గోవర్ధన్, రాధ, రమేశ్ పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ బిల్లులు మంజూరు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఎంపికైన లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో చేర్చి రూ. 5 లక్షలు చొప్పున మంజూరు చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడారు. గృహలక్ష్మి పథకంలో రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందుతుందని భావించిన లబ్ధిదారులు పాత ఇళ్లు కూల్చివేసి నూతనంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారని తెలిపారు. ప్రతి ఇంటిని అధికారులు సందర్శించి నేరుగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మారగానే గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసిందని ఆందోళన వెలిబుచ్చారు. మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలంటే ప్రస్తుతం పురోగతిలో ఉన్న ఇళ్ల లబ్ధిదారులు రోడ్డున పడే ప్రమాదం ఉందని అన్నారు. ఇళ్లు లేని నిరుపేదలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

టీపీయూఎస్ మండల కమిటీ ఎన్నిక

ఐనవోలు : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) మండల కమిటీని ఎన్నికల పరిశీలకులు సత్యనారాయణరావు, దాత మహర్షి ప్రకటించారు. అధ్యక్షుడిగా ముడుంబ శేషగిరి, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్‌రెడ్డి, కోశాధికారిగా రాంప్రసాద్, మహిళా ప్రతినిధిగా స్వర్ణలత, కార్యవర్గ సభ్యులుగా కిరణ్, రవికుమార్, ఉపాధ్యక్షులుగా శేఖర్, బాబు, కార్యదర్శులుగా రామనాథం, వెంకట్రామ్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

దామెర: మండలంలోని ఊరుగొండలోని బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామంలో ముగ్గురు ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తుట్లు గుర్తించారు. దీంతో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని విక్రేతలపై కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. కాగా కేసు వివరాల కోసం పరకాల ఎక్సైజ్ సీఐ జగన్నాథరావును సెల్‌ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.